

# అసలు మనిషి

గడియారం టిక్కు టిక్కు మంటుంటే, గోపాలం గుండె దడద లాడుతోంది. ఈ గడియారాన్ని ఆపెయ్యాలని, వీలయితే ఇరవై ఏళ్ళు వెనక్కు తిప్పెయ్యాలని చాలాసార్లు అనుకున్నాడు. సోఫాలోనుంచి లేచి, స్టూలు వేసుకుని గోడ గడియారం అద్దం తలుపుతీసి రెండు ముళ్ళనూ గట్టిగా పట్టుకున్నాడు. ఏమిటో కసి! ఈ రెండు ముళ్ళూ తిరిగి తిరిగి తనను అరగతీశాయి. నిగనిగలాడుతున్న జుట్టు, మెలికలు తిరిగిన కండరాలు, కళ్ళలో తళతళలన్నీ పోయాయి. బట్టతలమీద అక్కడక్కడ వెండి తీగెలు అతుక్కున్నట్టు ఊడటానికి సంశయిస్తున్న జుట్టు, నీరసంతో వేళ్ళాడుతున్న శరీరం. గడియారం ముళ్ళు రెండు బలంగా విరిచేసి తీసుకువచ్చాడు. చెత్తబుట్టలో పడేశాడు. సోఫాలో కాళ్ళు బారజాపుకుని కూర్చున్నాడు. మెత్తటి సోఫా మీద పట్టు మెత్తలు, అయినా నడుం పట్టేస్తోంది. తన ఎముకలే తనకు గుచ్చుకుంటున్నాయి. గడియారం వంక క్రోధంగా చూశాడు. టంగుటంగుమని మూడు గంటలు వినిపించాయి. ముళ్ళు పీకేశాడుగానీ గడియారం పెండ్యులం ఊగుతూనే ఉంది. చివాలున లేచి పెండ్యులం కూడా ఆపేశాడు. అతని ముఖంలో చిరునవ్వు తొంగిచూసింది. టైము ఆగిపోయింది.

సూటూబూటూ తీసేశాడు గోపాలం. నాలుగు అంతస్థుల మేడ మెల్లిగా దిగుకుంటూ వచ్చాడు. గారేజీ నుంచి కారు తీసి విసురుగా బయటకు వచ్చేశాడు. తన మేడ దూరం నుంచి కనిపిస్తోంది. మేడ పైన పూలమొక్కల దగ్గర పార్వతి తన అర్ధాంగి, తనలో సగం అనుకున్నాడు.

తను వేరు. ఆ మేడ వేరు. తనలో సగం పార్వతికాదు తనూ పార్వతి ఏమీకారు. ఇద్దరూ వేడిమనుష్యులు. కలిసి బ్రతకటానికి ఆ మేడ ఏర్పాటు చేసుకున్నారు. తనకయితే మేడక్కరలేదు. కారక్కరలేదు. కారులోనుంచి బయటకు వస్తుంటే బంధకంనుంచి బయటకు వస్తున్నంత సంతోషం కలిగింది. కారును ఒక్క తన్ను తన్ని ముందుకు నడిచాడు.

"ఏం అబ్బాయిగారూ కారు చెడిపోయిందా" వెంకటేశ్వర్రావు ఎదురయ్యాడు. అతనూ తానూ చిన్నప్పుడు చెడుగుడు ఆడారు. కాలవలో ఈతలు కొట్టారు. నేరేడు చెట్లెక్కి పళ్ళు తిన్నారు. తాటిముంజల కోసం పోయి తన్నులు తిన్నారు.

వెంకటేశ్వర్రావు పెద్దవాడయిం తర్వాత కార్లు రిపేరు చెయ్యటం నేర్చుకున్నాడు. కార్లమీద తిరగడం నేర్చుకోలేదు. తను పుట్టిన గుడిసెలోనే సంసారం పెట్టాడు. ఇల్లూ మారలేదు. పట్టణం వస్తూపోతూ ఉంటాడు.

"అవునురా...." గోపాలం నోట్లో నుంచి మాట వస్తూనే వెంకటేశ్వర్రావు కారు బానెట్ ఎత్తి చూస్తున్నాడు.

"ఇప్పుడు రిపేరేం వద్దులే" గోపాలం విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. కాలవవద్దు రాగానే చేతి రిస్టువాచి తీసి కాలవలోకి గిరవాటు వేశాడు. సూర్యుడు మెల్లగా చెట్ల వెనక్కు పోతున్నాడు కిరణాలు కళ్ళకు గుచ్చుకుంటున్నాయి. ఆ సూర్యుణ్ణి ఆపాలి. లేకపోతే పొద్దు కుంకిపోతుంది. పొద్దుకూకటానికి వీల్లేదు. సూర్యుడా ఆగు! గోపాలం ఒంటరిగా కాలవ వెంటబడి పెద్ద పెద్ద అంగలు వేస్తున్నాడు. చేత్తో ఏవో సంజ్ఞలు చేస్తున్నాడు.

ఈ ఇరవై ఏళ్ళలో తను ఎంతగానో మారిపోయాడు. పార్వతి కోరికలన్నీ తీర్చాడు. పార్వతికి తను బానిసై పోయాడు. ఆమె కోరినవన్నీ తెచ్చే బ్రహ్మరాక్షసుడిగా మారిపోయాడు. చిన్న ఉద్యోగం చేస్తున్నప్పుడు పార్వతికి ఎందుకూ కొరగాని వాడయ్యాడు. డబ్బు సంపాదించాలి. అదొకటే ధ్యేయం తనకు, డబ్బు.... డబ్బు! రాత్రింబవళ్ళు ఆ స్మరణే. తన మేడలో పూలమొక్కల మధ్య పార్వతి పూల అద్దకం చీరెలో తిరుగుతోంది. జపాను వెళ్ళినప్పుడు తను కొనుక్కువచ్చాడు. పార్వతి ఎంతగానో మురిసిపోయింది. ఆ సాయంత్రమే తను అర్జెంటుగా ఢిల్లీ వెళ్ళిపోయాడు. పది రోజుల తర్వాతగాని తను తిరిగి రాలేదు. ఆ కొత్తచీరె మడత నలగకుండా బీరువాలో అలాగే ఉండిపోయింది.

గోపాలం వంతెన మీదకు పోయి నీళ్ళలోకి తొంగిచూశాడు. అప్పుడే సూర్యుడస్తమిస్తున్నాడు. నీళ్ళన్నీ ఎరుపురంగు పులుముకుంటున్నాయి. ఈ ఇరవై ఏళ్ళు తను వెనక్కు పోగలిగితే తన ఆస్తిపాస్తులు అన్నీ వదులుకుంటాడు. తను కట్టుకున్న చొక్కా లాగూ చాలు. మొట్టమొదటగా తను పెళ్ళి చేసుకోవటంలో స్వతంత్ర్యమైన నిర్ణయం తీసుకుంటాడు. చచ్చినా పార్వతిని తను పెళ్ళిచేసుకోడు. ముష్టి మూడువేల కట్నం కోసం నాన్నా, తన తాలూకు బంధువు అని అమ్మా, తను చనిపోయేలోగా తన పెళ్ళి చూడాలనుకున్న తన తాతయ్య... ఈ ముగ్గురినీ కాదంటాడు. తనతో కాలేజీలో చదివింది. సన్నగా సన్నజాజి మొగ్గలా ఉండేది కృష్ణవేణి. ఆమెను పెళ్ళిచేసుకుంటాడు. తనంటే ప్రాణం. నోట్సు పేరుతో అస్తమానం తన దగ్గరకు వచ్చేది. ఏమీ మాట్లాడేదికాదు. కానీ అన్నీ మాట్లాడినట్టే అనిపించేది. ఆ కళ్ళల్లో మెర మెర ఈనాటికీ కనిపిస్తూ వుంటుంది. ఆ కళ్ళల్లోకి చూస్తూ తను జీవించగలడు. మరణించగలడు, కాని ఆ

కళ్ళేవీ ఇప్పుడు? తను చావుకు భయపడుతున్నాడు. ఈ సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఎవరి కళ్ళల్లోకి చూస్తూ తను కళ్ళు మూయగలడు? 'కృష్ణవేణీ, కృష్ణా! కృష్ణా! ఎక్కడున్నావు కృష్ణా! నన్నింత ఒంటరివాడిని చేశావేం కృష్ణా!' గోపాలం పెదిమలు కదులుతున్నాయి. కళ్ళలో నీళ్ళచుక్క నిలబడలేక బుగ్గలమీదకు జారుతోంది.

అసలా చిన్న గుమాస్తా ఉద్యోగంలో చేరాడు తను. ఉద్యోగం మారేదాకా ఎన్ని లెక్కలు చేశాడో లెక్కలేదు. తను కాలేజీ వదిలిపెట్టేదాకా కూడా క్లాసువర్కు, హోంవర్కు కలిసి అన్ని కాగితాలు, అంత సిరా ఖర్చు కాలేదు. కూడికలు, తీసివేతలు, హెచ్చవేతలు, భాగహారాలు... ఇవేనా? ఇంకేమైనా ఉన్నాయేమో, అన్ని కాగితాలు పాడు చేశాడు. "తొందరగా కానీండి..." అంటుండేవాడు మేనేజరు. తొందరగా, ఇంకా తొందరగా, ఉక్కిరి బిక్కిరిగా, రెండూ, రెండూ నాలుగు, రెండురెళ్ళు నాలుగు.... లెక్క తేలడంలేదు. చికాకు, ఆందోళన-లెక్క తప్పింది. రెండూ, రెండూ నాలుగే వస్తోంది. ఈ ఉద్యోగం చెయ్యలేదు. తను జీవచ్ఛవం అయిపోతున్నాడు. తను బ్రతికి ఉండడం కోసమే బొమ్మలు వెయ్యటం నేర్చుకున్నాడు. పాటలు పాడడం నేర్చుకున్నాడు. పార్వతికి ఇవన్నీ చూస్తే అసహ్యం.

"వచ్చే జీతం రాళ్ళు రెండు రంగులకు, కాగితాలకు ఖర్చుపెడితే సంసారం నడవక్కర్లేదా...?

'ఏమిటా కూనిరాగాలు... కూడు పెట్టనా... గుడ్డపెట్టనా....'

పార్వతి విసుక్కుంటూనే ఉండేది. పార్వతి ప్రాణం తీస్తే సినిమాకు వెళ్లాడు. అసలు తను చూడదలుచుకున్న సినిమాకు ఒంటరిగా పోతాడు. సినిమాలో ప్రేమకథ చూస్తుంటే దుఃఖం వచ్చింది. పేదపిల్లలను ప్రేమించి రాజరికం హోదా వదలుకుని వచ్చేశాడు. అన్నపానాలకు నోచుకోక బాధలు పడుతున్నాడు. అయినా మనిషి పిడుగులాగా ఉన్నాడు. కళ్ళు తళతళలాడుతున్నాయి. ప్రేమ కోసం అన్నీ వదులుకుని దిట్టంగా ఉన్నవాడిని చూస్తే గోపాలానికి దుఃఖం ఆగలేదు. కళ్ళవెంబడి నీళ్లు వచ్చాయి. ముష్టి మూడు వేలకోసం కక్కుర్తిపడి తన పెళ్ళికి ఒప్పుకున్నాడు. పార్వతి సరసన ఉంటే తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నాయి. పార్వతి గోపాలం కళ్ళల్లో నీళ్లు చూసింది.

'ఆ యాక్టర్లు ఏడిస్తే డబ్బిస్తారు..... మీరెందుకూ ఏడవడం...' అంది పార్వతి నలుగురికి వినబడేలా.

గోపాలం భగ్గున మండిపోతున్నాడు. కృష్ణవేణి అయితే తనమీదకు వాలిపోయేది. 'ప్రేమకు మించిందిలేదు' అనేది.

"ఈ ప్రపంచంలో అన్నీ మాయ... నువ్వే సత్యం...." అనేవాడు తను.

"నేనుకూడా మాయే, ప్రేమే సత్యం" అనేది కృష్ణవేణి.

వంతెనమీద అనుకున్న గోపాలానికి, దాంట్లోకి దూకేయ్యాలన్నంత ఆవేశం వచ్చింది. పళ్ళు పటపట కొరికాడు. పార్వతి తోటి జీవితానికి రాజీపడుతున్న సమయంలోనే ఉద్యోగం వదులుకున్నాడు. ఎదుగు, బొదుగూలేని ఉద్యోగంలో తనేమీ సాధించలేదు. తనొక్కడూ అయితే ఫరవాలేదు. సంసారం నడపడం అంటే అన్ని అవసరాలు కావల్సిందే. పిల్లకు పెళ్ళి చెయ్యాలి. పిల్లవాడిని పెద్ద చదువులు చదివించాలి, తను తీసుకున్న మూడు వేల కట్నం తనకొక పెద్ద గుదిబండయింది.

"ఏమిటే ఈ కట్నాలేమిటి... మరీ దారుణంగా ఉంది" అని తను ఎప్పుడన్నా పొరపాటున అంటే "మీరు కట్నాలు తీసుకున్నప్పుడు ఆనందంగా ఉందేం? అరటితోట ఎకరం అమ్మి మీ ముఖాన కుమ్మరించారు. మా నాన్న" అంటుంది పార్వతి. నిజమే! తను మళ్ళీ ఇరవై ఏళ్ళు వెనక్కు పోగలిగితే ఆ కట్నం తీసుకోడు. పార్వతికి అసలు విషయం తెలియదు. తను నిక్షేపంగా కృష్ణవేణిని పెళ్ళి చేసుకుంటాడు.

గోపాలం వంతెన దాటాడు. సూర్యుడు చెట్ల వెనక్కి దాగిపోతున్నాడు. సూర్యుడా! అస్తమించు! గోపాలం ఉద్వేగం పొందుతున్నాడు.

ఆఫీసులో పెద్ద మీటింగ్ అవుతోంది. ఎవరోవ్యక్తి బ్రహ్మాండమైన కారులో దిగాడు. ఆనాటి సభలో సుప్రసిద్ధులైన ఒక పండితుడి ఉపన్యాసం ఉంది. అతనికి తగిన సత్కారం కూడా ఏర్పాటు చేశారు. పండితుడిని ఆఫీసు గేటు దగ్గర ఆపేశారు. లోపలకు పోవటానికి వీల్లేదు అంటున్నారు. నీరుకావిపంచె, చేతిలోసంచీ, వంటిమీద చొక్కా లేకుండా రిక్షాలోనుంచి దిగుతుంటే చౌకీదారు ఆపేశాడు. ఎవరికో కబురు చెయ్యమని అతను ప్రాధేయపడుతున్నాడు. "ఇప్పుడు కాదు, రేపు పగలు రండి" అంటున్నాడు చౌకీదారు. గోపాలం అటువంకనే చూస్తున్నాడు. తను మీటింగ్ తాలూకు వాళ్ళకు కబురుపెట్టి పండితుణ్ణి లోపలకు రప్పించాడు. ఆరోజు తనొక మంచిపని చేసినందుకు గొప్పగా పొంగిపోయాడు.

"కార్లకు మర్యాద ఎక్కువయింది.... పాండిత్యానికి మర్యాద తక్కువయింది" సభా ప్రసంగంలో అన్నారు ఎవరో... 'కారు' మనిషికాదు. అతని 'వేషం' మనిషి కాదు గోపాలంతో ఎవరో ఉద్రేకంగా వాదిస్తున్నాడు. అవును 'మనిషి' వేరు 'వేషం' వేరు. గోపాలం ఆలోచనలో పడిపోయాడు. మనిషి వేరు పాండిత్యం వేరు. పాండిత్యం తీసేస్తేగాని అసలు మనిషి బయటపడడు. గోపాలం గట్టిగా వాదిస్తున్నాడు. గోపాలానికి ఆనాటి దృశ్యం కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తున్నది.

తను... మేడ, భార్య, సూటు, బూటు, కారు... అన్నీ వదిలి ఇక్కడ ఒంటరిగా నిలబడ్డాడు. తను సంపాదన ప్రారంభించి ధనవ్యామోహంలో పడిన తర్వాత చెయ్యరాని పనులంటూ తనకు కనిపించలేదు. ప్రతిదీ సహజంగా కనిపించింది, మనుష్యులు మరబొమ్మలాగా ఆడారు తన ముందు. ఎవరిసుఖం వారిది, ఎవరిలోభం వారిది. ఈ నాటకంలో ఎవరి పోర్షను వారిది.

గోపాలం చీకటి పడుతుందని భయపడుతూ ముందుకు నడుస్తుంటే ఎవరో చిన్నపాప గుక్కపట్టి ఏడవటం వినిపించింది. ఉలిక్కిపడి చుట్టూ చూశాడు. ఏడుపు వస్తున్నవైపు గబగబా అడుగులు వేశాడు. తప్పటడుగులు వేస్తూ కాలవవైపు ఒంటరిగా చిన్నపాప నడుస్తూ కనిపించింది. కొంచెం అయితే కాలవలోకి పడిపోయేది! గోపాలం ఉరుక్కుంటూ వెళ్ళి పాపను అందుకుని ఎత్తుకున్నాడు. గుండెలకు హత్తుకున్నాడు. పాప గుక్కపెట్టి ఏడుస్తోంది. ఎవరిపాప? చుట్టుపక్కల కలయచూశాడు. అక్కడ కొంతసేపు నిలబడి పెద్దరోడ్డు మీదకు వచ్చాడు. కనిపించిన వాడినల్లా అడగటం మొదలుపెట్టాడు. ఇంకొంచెం సేపయితే చీకటి పడుతూంది. కాలవ పక్కన గుడిసెల వాళ్ళందరినీ అడిగాడు, పాప మంచి గౌనే తొడుక్కుంది. ఒక గుడిసెలోంచి ముసలామె ఒకతే లాంతరు వెలిగించి వత్తి పెద్దది చేసుకుంటూ బయటకు వచ్చింది.

'ఎవరూ....'

గోపాలం పాపను చూపించాడు. నలుగురూ గుమిగూడారు.

"ఎంకటి కూతురు కాదటే...." అవ్వ దీర్ఘం తీసింది.

"ఆ గౌనెక్కడిదే దానికి.... దీనిల్లు బంగారంగాను.... దొరబిడ్డ అనుకున్నాను...."

"అవునే! గౌను వేస్తే... పెద్దింటి బిడ్డలాగుంది...."

"ఏం కావాలయ్యగారు.... చలిలో పాపనుకూడా తీసుకువచ్చారు..."

"నీ తెలివి తెల్లారా... అదీ మన ఎంకటి కూతురు కాదంటే.... ఆయన కూతురంటున్నావు..."

అందరూ తలొక విధంగా మాటాడుతుంటే గోపాలానికి నోట మాటరాలేదు.

"మీ కెక్కడ దొరికింది....బాబూ ఈ పిల్ల...."

"కాలవ దగ్గర దొరికింది... కాస్తంతయితే దాంట్లోపడి పొయ్యేది... ఈ పాటికి చచ్చిపోయేది..."

"అది బతికి ఏటి సార్థకం... ఎవరు సూస్తారు..."

"ఎవరు చూసేదేమిటి... ఎంకటి ఏమయిపోయాడు..."

"ఎరికలేదేంటి.... దశమినాడు కూలీకిపోయి... తిరిగి రాలేదుగా... మళ్ళీ అమావాస్యవచ్చె...."

"ఏటి..... ఏమయిపోయాడంటావు..."

"ఏటో ఎవరికి తెలుసు. ఆ ఎంకటి తిరిగి రాకపోయే... ఎవరు చూస్తారు. ఈ పిల్లను..."

గోపాలానికి ఏమిటో అర్థం అవుతున్నట్లు అనిపించింది. ఎంకటి తిరిగిరాడు. ఈ పిల్ల వీళ్ళెవరికీ అక్కరలేదు– తను మటుకు ఏం చేసుకుంటాడు. ఏమీ మాట్లాడకుండా కాలవఒడ్డు వెంబడి వంతెన మీదకు నడుచుకుంటూ పోయాడు. ఎవ్వరూ అడ్డు చెప్పలేదు. తనూ, పాప ఎవ్వరూ లేరు. ఈ సమస్య తను అనేక రకాలుగా పరిష్కరించగలడు. తను ఏం చేసినా ఎవరికీ తెలియదు. ఆ పాప గుండెల మీదకు వాలిపోతుంటే వంతెనమీద నిలబడి పాపను రెండు చేతులతో పైకెత్తాడు. సూర్యబింబం కొంచెంగా కనిపిస్తోంది. తను ఏం చేస్తున్నాడో అతనికే తెలియటం లేదు. తన జీవితం వ్యర్థం అయింది. తన జీవితం తిరిగిరాదు. చివికిపోయిన శరీరంతో తను చేయగలిగింది, సాధించగలిగిందీ ఏమీలేదు. సుఖంకోసం అన్వేషణలో అంతులేని కష్టాలు కొని తెచ్చుకున్నాడు. అన్నీ ఇప్పుడు చేతికి అమిరినాయి. కాని శరీరం అనుభవించే స్థితిలో లేదు. మందులు తప్పితే ఇంకేమీ జీర్ణం చేసుకోలేని స్థితిలో ఉంది తన జీర్ణశరీరం.

తను ఎవరికీ అక్కరలేదు. ఈ పాప ఎవరికీ అక్కరలేదు. ఆందోళనపడుతున్నాడు గోపాలం. పైకెత్తిన పాప దూరాన ఉన్న సూర్యబింబం మీద నిలబడ్డట్లు కనిపిస్తోంది. ఎంత చక్కటి దృశ్యం! తను ఆ వర్ణచిత్రం గీస్తాడు. తన గొంతులోనుంచి పాట వస్తోంది. ఎంత మధురంగా ఉంది. ఆ పాట! సూర్యబింబం చరాచరా జగత్తు వెనక్కు కుంగింది. గోపాలం కళ్ళ ఎదుట అంతులేని వెలుగు. పాప తన మెడచుట్టూ చేతులు వేసింది. పాప చిన్న చేతులు గడియారం ముళ్ళులాగా కదులుతున్నాయి. తనకు పోయిన జీవితం మళ్ళీ వచ్చింది. తను రెండేళ్ళ పాపగా మారిపోయాడు.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక - 30 జూలై, 1976)